క్లుప్తంగా

నేడు ప్రభుత్వ విప్ పీఆర్కే రెంటచింతల రాక

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలకు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రానున్నట్లు ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం, వెలుగు ఏపీఎం ఎం.చినబాబు సోమవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 738 స్వయం సహాయక సంఘాల సభ్యులైన 7,098 అక్కాచెల్లెమ్మలకు రూ. 7,22,37,000 చెక్కును ప్రభుత్వ విప్ పీఆర్కే చేతుల మీదుగా అందజేయనున్నట్లు వారు తెలిపారు. స్థానిక శివాలయం ఆవరణలోని కల్యాణమండపంలో ఉదయం 10 గం.లకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయంసహాయక సంఘాల సభ్యులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొనాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి



దాచేపల్లి: కేసానుపల్లి మాజీ సర్పంచ్ నెల్లూరి మధుబాబు(47) రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతి చెందాడు. మహబూబ్ నగర్ నుంచి పిడుగురాళ్లకు వస్తున్న క్రమంలో పెదరావూరు వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ ఘటనలో మధుబాబు తలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మధుబాబుకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. 2004 నుంచి రెండేళ్లు సర్పంచ్‌గా మధుబాబు పనిచేశాడు.

మొక్కజొన్న తోటలో గంజాయి మొక్కకోసం..



గురజాల : మాడుగుల గ్రామంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫ్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో మొక్కజొన్న పంటలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే సమాచారంతో.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురజాల ఎస్ఈబీ ఎస్ఐ జయరాం తన సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ దాడుల్లో ఏమి లభించలేదని వారు తెలిపారు.

బహిరంగ వేలం

పిడుగురాళ్ల: మిషన్ శోభాకృత్ కార్యక్రములో భాగంగా పురపాలక సంఘ పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయల్లో ఉన్న పాత ఇనుప సామానులు, కుర్చీలు, టేబుళ్ల మొదలగునవి బహిరం వేలం ద్వారా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ. వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ వేలంపాట ఈ నెల 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు కమిషనర్ సమక్షమున బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనేవారు 10వ తేదీ 3 గంటలోపు రూ. 50 వేలు డీడీ, నగదు, చలానా రూపములో డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలియజేశారు. 3 గంటల తర్వాత చెల్లించిన డిపాజిట్లు చెల్లవని తెలియజేశారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయ పని వేళల్లో ఇంజినీరింగ్ విభాగంలో అడిగి తెలుసుకోవాలన్నారు. మరన్ని వివరాలకు : 98499913254 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ: ఇరువురికి గాయాలు



రెంటచింతల: స్థానిక నేంద్రవాగు సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రమైన గాయాలు అయిన ఘటన జరిగింది. తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ హనుమాన్‌పేటకు చెందిన మిరియాల సుధాకర్ మాచర్ల మండలం కంభంపాడు గ్రామ శివార్లోని ఓ రైస్ మిల్లులో ఇంజన్ మోటర్‌కు మరమ్మతులు చేసి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం వేగంగా ఢీ కొనడంతో ఇరువురికి తీవ్రగాయాలు అయ్యాయి. సుధాకర్ గురజాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మరో వాహనానికి చెందిన అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించినట్లు ఆ సమయంలో అక్కడ ఉన్న వారు తెలిపిన సమాచారం.

వివేకానంద స్ఫూర్తితో విద్యనభ్యసించాలి

మాచర్ల రూరల్: నవభారత నిర్మాణం కోసం స్వామి వివేకానంద చేపట్టిన ఉద్యమం ఆయన ప్రవచనాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థానానికి ఎదగాలని రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని తాళ్ళపల్లి, జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే నైతిక, ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు ప్రతి పాఠశాలలో స్వామి వివేకానంద సాహిత్యాన్ని ఉచితంగా అందజేస్తున్నామని, అలాగే జాగృతి, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవానంద్, ఉపాధ్యాయులు కొరటా కోటేశ్వరరావు, రిటైర్ట్ హెచ్ఎం ముత్యాల పాపిరెడ్డిలు పాల్గొన్నారు.

నేటి నుంచి పల్నాటి బ్రహ్మోత్సవాలు





శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం

మాచర్ల: పల్నాటిలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవాలయంలో మంగళవారం నుంచి పదహారు రోజుల పాటు అత్యంత వైభవంగా స్వామి వారి సేవా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా బ్రహ్మోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. శ్రీలక్ష్మీచెన్నకేశవ దేవుడికి 13వ శతాబ్దంలో మరోసారి బ్రహ్మనాయుడుచే దేవాలయాన్ని ప్రతిష్ఠించి గర్భగుడి ముందు రంగమండపాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి మహిమలు నమ్మి ప్రజలు చెన్నకేశవుని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తరలి వస్తారు. మాచర్లలో తూర్పు దిక్కు నుంచి ఉత్తరం వైపు ప్రవహిస్తున్న చంద్రవంక వాగు తీర ప్రాంతాన్ని ఎంతో పవిత్రంగా భావించి నాలుగు దశాబ్ధాల క్రితం కార్తికేయ చెన్నకేశవ దేవాలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్యం భక్తులు శ్రీలక్ష్మీచెన్నకేశవుని ఆరాధిస్తారు. ప్రతి ఏడాది చైత్రశుద్ధ పౌర్ణమి రోజు కల్యాణం, చైత్ర బహుళ పంచమి రోజున రథోత్సవం జరుపుతారు. అందులో భాగంగా మంగళవారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వార్లకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు జరుపుతారు. ప్రతి రోజూ వివిధ అవతారాల్లో స్వామి వారి దంపతులను అలంకరించి ఉత్సవ విగ్రహాలను చిన్న రథం పై ఊరేగిస్తారు.

ప్రత్యేక కార్యక్రమాలు...

ఈ నెల 6వ తేదీన స్వామి వారి కల్యాణాన్ని రాత్రి 9గం''లకు అర్చకులు సీహెచ్ శేషాచార్యులు, శ్రవణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించబడతాయి. దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ ఐ సాంబయ్యల ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. 16 రోజుల పాటు ఏప్రిల్ 4 నుంచి నిర్వహించే వివిధ కార్యక్రమాలలో ముఖ్య అతిధులుగా ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కోఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, ఆయా వార్డు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరగనున్నాయి. వీటన్నింటిని జయప్రదం చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకొని ఆలయాన్ని రంగులతో అలంకరించారు. అదే విధంగా మాచర్ల పట్టణంలో చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి వివిధ ప్రాంతాలలో ప్రత్యేక లైటింగ్ ఏర్పాటు చేసి భక్తులకు సర్వసౌకర్యాలు కల్పించటానికి ఏర్పాట్లు చేశారు.



శ్రీ చెన్నకేశవ స్వామి



శ్రీలక్ష్మీ అమ్మవారు

మహిళల ఆరోగ్య సంక్షేమమే జగనన్న లక్ష్యం

మాచర్ల రూరల్: గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డను జన్మనిచ్చేందుకు జగనన్న పౌష్టికాహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీదేనని సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు ఇంగ్లిషు మీడియం బోధన అందించటమే కాకుండా గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యంగా ఉండేందుకు విలువైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు గాలి బాలిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్‌లు దారం అనంతలక్ష్మి, మూలం నాగలక్ష్మి, ఆలేటి ప్రభావతి పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న సర్పంచ్ ఓరుగంటి అంగన్‌వాడీ సిబ్బంది

జగనన్న పాలన భవిష్యత్ తరాలకు వరం

మండల సచివాలయ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి



దుర్గి: జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రతి అడుగు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం తపించారని మండల సచివాలయ కన్వీనర్ బొబ్బా సీతారామిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ కన్వీనర్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన మేరకు ఇంటింటికీ గతంలో కన్నా మన ప్రభుత్వ పాలనలో జరిగిన మేలును వివరించాలని పేర్కొన్నారు. అదే విధంగా మన కోసం, మన పిల్లల భవిష్యత్ కోసం జగనన్న ప్రభుత్వాన్ని మరలా తీసుకురావడానికి ప్రతి సచివాలయ కన్వీనర్ ఇంటింటికీ ప్రచారం నిర్వహించి ప్రజా మద్దతును కూడగట్టాలని పేర్కొన్నారు. గృహసారథులు, ప్రచార సామాగ్రిని ఉపయోగించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లు సమీప సచివాలయాలలో సమావేశాలు నిర్వహించి పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో నాలి రామయ్య, తోటకూర వెంకటేశ్వర్లు, మాదాసు శ్రీరామమూర్తి, బీర్నిడి దానయ్య, మమ్ము శివరాం, కటకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి

ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ బ్రహ్మచారి

విజయపురిసౌత్: విధి నిర్వహణలో ఎస్పీఎఫ్ సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీఎఫ్ అడిషనల్ కమాండెంట్ బ్రహ్మచారి అన్నారు. నూతనంగా అడిషనల్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఇక్కడి నుంచి హైదరాబాద్ హైకోర్టుకు బదిలీ అయిన అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్‌తో కలిసి నాగార్జునసాగర్‌లోని ఎస్పీఎఫ్ కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కమాండెంట్ బ్రహ్మచారి మాట్లాడుతూ ఎస్పీఎఫ్ సిబ్బంది ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా అధికారులు, ప్రజలతో మర్యాదగా మెలగాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అసిస్టెంట్ కమాండెంట్‌గా చంద్రశేఖర్ నిబద్ధతతో పనిచేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో బదిలీలు సర్వసాధారణమన్నారు. ఆంధ్రా–తెలంగాణా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం నాగార్జునసాగర్ ప్రాజెక్టు అని అటువంటి సున్నితమైన ప్రాంతంలో ఎటువంటి వివాదాలు చోటుచేసుకోకుండా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీఎఫ్ కమాండెంట్ బ్రహ్మచారి, బదిలీ అయిన అసిస్టెంట్ కమాండెంట్ చంద్రశేఖర్, జెన్‌కో ఆర్ఐ నరేష్‌లను ఉద్యోగులు శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాగర్ డ్యాం ఇన్స్‌పెక్టర్ భాస్కర్, ఇరిగేషన్ డీఈ మురళీధర్, ఎస్పీఎఫ్ ఎస్ఐ విజయకుమార్, జెన్‌కో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ నరసింహులు, దయానంద్, మట్టారెడ్డి, సక్రూ, వెంకటేశ్వరరెడ్డి, డీడీ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ కమాండెంట్ బ్రహ్మచారి

ప్రశాంతంగా పది పరీక్షలు

దాచేపల్లి:పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా సోమవారం ప్రారంభమయ్యాయి. దాచేపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు, స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఏపీ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8.30గంటలకే చేరుకున్నారు. సరస్వతీదేవి విగ్రహాలకు విద్యార్థులు పూజలు చేశారు. పరీక్ష కేంద్రాలను సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింట్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పిడుగురాళ్ల: పట్టణంలో ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు లాంగ్వేజ్ 1 పది పరీక్ష కేంద్రాల్లో మొత్తం 2037 మంది హాజరు కావల్సి ఉండగా 11 మంది హాజరు కాలేదని ఎంఈఓ ఓ. రాజు తెలియజేశారు. అనంతరం పరీక్ష కేంద్రాలను ఎంఈఓ ఓ. రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ ధనలక్ష్మీ, ఎంపీడీఓ కాశయ్యలు పరీక్షించారు. జానపాడు పరీక్ష కేంద్రాన్ని డీఈఓ శ్యాముల్, బ్రాహ్మణపల్లి పరీక్షా కేంద్రాన్ని ఎస్ఎస్‌సీ పల్నాడు పరిశీలకులు వి. చంద్రకళ పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష కేంద్రం నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు.

గురజాల : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుడ్ న్యూస్ ఇంగ్లీషు మీడియం, ఆదర్శ పాఠశాల, శివాని పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. 13 మంది పరీక్షకు గైర్హాజర్ అయినట్లు ఇంచార్జీ ఎంఈఓ శనగల వెంకట ప్రసాద్ తెలిపారు. శివాని విద్యానికేతన్ పరీక్ష కేంద్రాన్ని తహసీల్దారు మీసాల దానియేలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులపై అడిగి తెలుసుకున్నారు.

ఏర్పాట్లను తనిఖీ చేసిన తహసీల్దారు

కారెంపూడి: పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న మోడల్ స్కూల్, బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్, సెయింట్ జాన్స్ హైస్కూలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లు చేశారా.. లేదా.. అనే విషయాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద వంద మీటర్ల పరిధి వరకు 144 సెక్షన్ విధించడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మాల్ ప్రాక్టీసు లాంటివి జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కేంద్రాల చీఫ్, డిపార్టమెంటల్ అధికారులను కోరారు. మొత్తం 716 మంది విద్యార్థులకు గాను 706 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు.

పది పరీక్షలకు 7గురు గైర్హాజరు

మాచవరం: మండలంలో సోమవారం జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మొదటి రోజు 7 గురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ ప్రసాద్ తెలిపారు. జెడ్పీ హైస్కూల్‌లో 233 మంది విద్యార్థులకు గానూ 6 గురు, జీకే హైస్కూల్‌లో 230 మంది విద్యార్థులకు గానూ 1 విద్యార్థి గైర్హాజరు అయ్యారని తెలియజేశారు. రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి ఘటనలు జరగకుండా సజావుగా జరిగినట్లు తెలిపారు. పరీక్షల నిర్వాహణకు ఎస్ఐ ఎస్. కోటయ్య తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు విషయాన్ని గమనించి, పరీక్షలు ప్రశాంతంగా జరిగేదుకు సహకరించాలని కోరారు.

వెల్దుర్తి: మండలంలోని వెల్దుర్తి, గుండ్లపాడు, మండాది, శిరిగిరిపాడు, ఐటిడిఏ పాఠశాల, కస్తూరిబా పాఠశాల, కండ్లకుంట జెడ్పీహెచ్ఎస్, ఏపి మోడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం తెలుగు పరీక్ష జరిగాయి. అన్నీ పాఠశాలలో 424 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. కండ్లకుంట జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల, ఏపి మోడల్ పాఠశాలకు చెందిన 91 మంది విద్యార్థులు మాచర్లలో పరీక్షలకు హాజరు కాగా, మండలంలోని శిరిగిరిపాడు, వెల్దుర్తి జెడ్పీ హెచ్ పాఠశాలలో 333 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. అందులో వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 142కి 142, శిరిగిరిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 191కి 190 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను ఎంపీడీఓ డి ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్యలు పర్యవేక్షించారు. పాఠశాలల వద్ద ప్రజలు గుమిగూడకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మాచర్ల: పట్టణ, రూరల్ ప్రాంతాల్లో మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో సోమవారం వందలాది మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై తెలుగు పరీక్షను ప్రశాంతంగా రాశారు. ఉదయం 9.30గం''లకు దాదాపుగా ఆయా సెంటర్లలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షను రాయడం జరిగింది. పట్టణంలో ఏడు పరీక్షా కేంద్రాలుండగా జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ బాలికోన్నత పాఠశాల, కిడ్స్ పాఠశాలలో రెండు సెంటర్లు, ఆక్స్‌ఫర్డ్, సెయింటాన్స్ ఇంగ్లీషు మీడియం, తెలుగు మీడియం పాఠశాల, సాగర్‌లో రెండు పరీక్షా కేంద్రాలు మొత్తం 1425 మంది హాజరు కావాల్సి ఉండగా 17 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సకాలంలో విద్యార్థులు పరీక్షా కేంద్రాలలో మొదటి రోజు ప్రశాంతంగా పరీక్ష వ్రాసినట్లు ఎంఈఓ వేముల నాగయ్య, వివిధ రెవిన్యూ ఉన్నతాధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

దుర్గి: మండలంలోని ముటుకూరు, అడిగొప్పల, ఓబులేశునిపల్లె, దుర్గి, కస్తూరిబా పాఠశాల, జెడ్పీహెచ్ఎస్, ఏపి మోడల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం తెలుగు పరీక్ష జరిగాయి. అన్నీ పాఠశాలలో 459 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యారు. అందులో దుర్గి మోడల్ స్కూల్‌లో 241కి గాను 236 హాజరయ్యారు. ఐదుగురు గైర్హాజరయ్యారు. దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 226కి 219 హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు. గతంలో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించేవి ప్రస్తుతం సిట్టింగ్ స్క్వాడ్‌లుగా మారి ఈ పరీక్షా కేంద్రాల్లో మొదటి నుంచి చివరి వరకు ఉన్నారు.

విజయపురిసౌత్: పదో తరగతి పరీక్షలు విజయపురిసౌత్‌లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 92 మంది విద్యార్థులకు గాను 91 మంది, అలాగే పీటీజీ పాఠశాల పరీక్ష కేంద్రంలో 187 మంది రెగ్యులర్, నలుగురు సప్లమెంటరీ విద్యార్థులు మొత్తంగా 191 మంది రాయవలిసి ఉండగా 190 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చెన్నకేశవుని కల్యాణోత్సవ కరదీపిక విడుదల

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రమైన కారెంపూడిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణోత్సవం ఈ నెల ఆరో తేదీ నిర్వహించనున్న నేపథ్యంలో కల్యాణోత్సవ కరపత్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనవల్సిందిగా ప్రభుత్వ విప్ పీఆర్కేను ఆలయ కమిటీ చైర్మన్, పాలక వర్గ సభ్యులు, కారెంపూడి పార్టీ నాయకులు ఆహ్వానించారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లా వీర్లవరప్రసాదరావు, పల్నాడు జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, పార్టీ నాయకులు కరాలపాటి సుబ్బారావు, పాతూరి రామిరెడ్డి, ఆళం విజయభాస్కర రెడ్డి, వేముల లింగయ్య, మర్రి శేషయ్య, జొన్నలగడ్డ శ్రీను, చింతల శ్రీను, పైయ్యావుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవ కరపత్రం విడుదల చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పార్టీ నాయకులు

శివాలయం జీర్ణోద్ధరణ పనులు పరిశీలన

దాచేపల్లి : గామాలపాడు గ్రామ సమీపంలోని నాగులేరు ఒడ్డున నాయకురాలు నాగమ్మ నిర్మించిన శివాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సోమవారం పరిశీలించారు. శివాలయం జీర్ణోద్ధరణ పనులు మే నెలలో నిర్వహించేలా కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శివాలయం అధీనంగా ఉన్న 18 ఎకరాల్లో జరుగుతున్న చెట్ల తొలగింపు పనులను ఎమ్మెల్సీ జంగా పరిశీలించారు. శివాలయాన్ని సందర్శించి పనులపై కమిటీ సభ్యులతో మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని, ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలని సూచించారు. సర్పంచ్ జంగా సురేష్, జెడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, మాజీ ఎంపీపీ అంబటి శేషగిరి రావు, వాణిజ్య విభాగం జోనల్ ఇన్‌చార్జి మాశెట్టి బుజ్జి, ఎంపీటీసీ షేక్ ఆదాంసాహెబ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి వంగా పద్మావతి, కౌన్సిలర్లు నాగుబండి గురువులు, షేక్ షరీఫ్, మాజీ సర్పంచ్ మాశెట్టి పుల్లారావు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ చాప శేషయ్య, బొల్లా పెదరామయ్య, గద్దల వేదమణి, మందా బెంజిమెన్ తదితరులున్నారు.



ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ జంగా

అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం చేయాలి

దాచేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలు ప్రజలకు మరింత దగ్గరవ్వాలని ఎంపీపీ కటకం జయశ్రీ అన్నారు. నడికుడి–1 సచివాలయంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడ సోమవారం నిర్వహించారు. వెల్‌బేబి షో నిర్వహించి సంవత్సరం నిండిన చిన్నారుల్లో పూర్తి వ్యాధినిరోధక టీకాలు వేసుకుని బరువు, ఎత్తు వయస్సుకు తగినట్లుగా ఉన్న చిన్నారులకు బహుమతులు అందించారు.

చిరు ధాన్యాలతో వివిధ వంటలు తయారు చేసి అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాలను మరింతగా బలోపేతం చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాదిరూపాయలు ఖర్చు చేస్తున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసం కార్యకర్తలు పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కోప్పుల సాంబయ్య మాట్లాడుతూ..రాగి, జొన్న, సజ్జ, కొర్రలు, ఒరిగలు లాంటి చిరుధాన్యాలు తినటం వలన ఆరోగ్యకరంగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ...ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిరోధించాలని, జీరోవేస్ట ద్వారా పర్యావరణంను కాపాడవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీవో సాంబశివరావు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బుగ్గల జానీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వరలక్ష్మీకుమారి, అరుణశ్రీ, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల తల్లిదండ్రులకు బహుమతులు అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇఫ్తార్ విందులో పీఆర్కే

మాచర్ల: ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఉపవాసం పాటించి అల్లా ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందకరమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి 31వ వార్డు కౌన్సిలర్ షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందు ప్రారంభం సందర్భంగా మాట్లాడుతూ ముస్లింలకు అన్ని రకాలుగా న్యాయం చేస్తానని ప్రభుత్వ విప్ పీఆర్కే అన్నారు. ఏ ఒక్క ముస్లిం కుటుంబం ఇబ్బందికి గురి కాకుండా నియోజక వర్గంలో చూసుకునే బాధ్యత తనదన్నారు. అనంతరం ముస్లిం పెద్దలతో కలిసి దువా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, ఆయా వార్డు ముస్లిం పెద్దలు, కౌన్సిలర్లుతో పాటు వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి

కస్తూర్బాపాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

మిట్టగుడిపాడు(రెంటచింతల): విద్యార్థినిల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర పరిశీలకులు మేరి విజయ చంద్రిక అన్నారు. సోమవారం ఆమె మిట్టగుడిపాడు గ్రామ శివారులోని కస్తూర్బాపాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిల్లో అక్షరాస్యత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టి పలు రకాల పథకాలను అమలుచేస్తున్నట్లు వివరించారు. విద్యార్థినిలకు ప్రభుత్వం నిర్దేసించిన మెను ప్రకారం ఖచ్చితంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల్లోనే నిర్ణయించబడుతుందనే విషయాన్ని ప్రతి విద్యార్థిని గమనించాలని సూచించారు. తమ పిల్లలు ప్రగతిలో వెనుకబడడానికి గల కారణాలను తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు టీచర్లతో చర్చించాలన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు మేరి విజయ చంద్రిక

గంజాయి కేసులో ఇద్దరి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమంగా గంజాయి కలిగిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. మార్కెట్ సెంటర్ సమీపంలో అనుమానస్పందంగా తిరుగుతున్న షేక్ మస్తాన్‌వలి, సుభానిలను అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

● అనుమతిలేని క్వారీలపై చర్యలు తీసుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): నిబంధనలకు విరుద్ధంగా క్వారీలను నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ, ఏఐసీసీటీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు తోట ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా క్వారీల్లో పేలుడు పదార్థాలను వినియోగించి ఇరువురు కార్మికుల మృతికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.